# అవ్యక్త మధురిమలు

వెంపటి నాగభూషణం

ఆమె... ఒంటరితనము—

ఉషస్సుమనోరోచులలో రాగసంపదలు అలవరించుకుని మధుపకుమారుని ప్రణయమున పులకించే శుభావసరమున... విధివిధానమున... ఇనకరగ్రీష్మశనికారణమున... పద్మనికి... ఒంటరితనము—

ఆశ్రయరాహిత్యమున... వసివాడి, నేల కొరగిపోయే నవవల్లరి...

—ఇరువంకలా, తామరతంపరగా, ఆ అమ్మాయికి బంధువులు, నా అన్నవారు ... ఉన్నారు ... ఆనాడు ఉదయమువరకూ... కొదువ ఏమీ కనుపించలేదు; సాయంకాలము తిరుగకముందే... మిగిలినది ఏమీ లేదు: ఆమె ...ఒంటరిది;

ఇంట్లో అందరూ... తిరిగి వచ్చి, అనుభవించలేని యమయాతనను నిద్రలో బలవంతముగా ముంచివేసి అవశులుగా పడిఉన్నారు. ఆమెను ఊరడించడానికి... సంగతి విచారించడానికి తగిన స్వాస్థ్యము ఎవరికున్నది? కడుపుదుఃఖము... ఆజన్మాంతమూ కోత; అందులో వయసు మళ్లినవాళ్లు... ఇక, ఆపదలో ఆదుకునేందుకు వచ్చిన ఇతరులు... కావలసినవాళ్లు... పవలంతా, అలసిపోయి...

అంతేకాబోలు—ఎవరున్నా, అయిన ఆ ఒక్కడూ లేకపోతే... ఇల్లు బావురుమంటూండదూ? గదిలో ...అలంకారము లన్నీ చీకటి కబళించివేసినది; ఎవరూ దీపము తీసుకురాలేదు అక్కడికి; అవసరమున్నా లేదు; ఆనందంలో వెన్నెలలో మునిగి తేలే లోకానికీ, ఆమెకూ మధ్య అడ్డుకట్ట. అంధకారము...

చిరిచాపమీద, కాళ్లు రెడ్డిగంవేసుకుని...కూర్చుని ఉన్నది; ఏడ్పు రావడంలేదు. ఆసంగతే మరచిపోయింది...పవలంతా, గుండె పగిలిపోయేటట్టు...ఆనిర్జీవమూర్తిపాదములదగ్గిర పడి... ఏడ్చిఏడ్చి...సోలిపోయి ఏడువడానికి ఓపిక లేక... కళ్లనీళ్లు వరదలైపోగా... ఇప్పుడు... వేటికీ త్రాణలేదు... కన్నీరు, హృదయంలో అతడు రగిల్చిపోయిన ఔర్వానలంలో ఇగిరిపోయింది...

ఉదయం కాఫీ త్రాగి...గుమ్మంమీద స్వారికి... మామూలుగానే, బయలుదేరినాడు: ఆమె కిటికీలో నుంచి... మలుపుతిరిగి కనుమరుగైపోయేటంతవరకూ చూస్తూనేఉన్నది... అది పరిపాటి అయిపోయింది.

నోచిననోములలో ఏమికొరత వున్నదో... కాపురమునకు వచ్చినతరువాత, అతడు, ఓనాడూ ఆమెను కన్నెత్తి చూసినపాపమున పోలేదు. మరీ కొత్తలో మనసులో కోరికలను... బిడియపడి... మనసులోనే మాటుపరచుకుని... ఉవ్విళ్లూరుతూ ఊరుకునేది ఆతనికి ఏనాటికైనా మనసు తిరుగక పోతుందాఅని; రోజులు గడిచి... నెలలు మళ్లిపోయినవి: ఆతనిలో మార్పు ఏమీ కలుగలేదు, సరి, ఆనాటి కానాడు దూరమైపోతూవచ్చినాడు. ఆమె నేరము ఏమిటో తెలియదు...

తెలివితేటలు లేవా, అందగత్తె కాదా— చదువు ఇచ్చితే అతనికి మనసువచ్చినట్టు నడచుకోలేనిదా... ఆమెవల్ల లోపము ఏమిటి?

ఎన్నాళ్లో ఓపికపట్టి చూసింది. లాభము లేదని తోచినతరువాత ... చొరవచేసుకుని స్వయందూతిగా తన్ను అర్పించుకునేందుకు సిద్ధమైనది... కులపాలికా సహజమైన లజ్జను విడిచి కాళ్లంటి బతిమాలుకున్నది... ఆతనిమనసు కరుగలేదు...

ఇంకొకరిని... ఎవరినన్నా ప్రేమించుతూన్నాడా? ఆసంశయము అనుక్షణమూ తోస్తూండేది. కాని,

అతనిప్రవర్తనలో... ఏదోషమునకూ తావు కనపడ లేదు... మరి...?

ఉన్నట్టుండి, తలవనితలపుగా, ఆమె భాగ్య రాశి... పండిపోయింది. అవాళ, రోజూలాగానే ఆయనగదిలో, పాలూ, మంచినీళ్లూ ఉంచడానికి తీసుకు వెళ్లింది; సాధారణంగా, నిద్రపోతూండేవాడు... మీద చెయివేసి మెలకువ తెప్పించడానికి ఆమెకు... ఇది వరకు స్వాతంత్ర్యములేదు... వచ్చినక్రొత్తలో అలా చేసినప్పుడు నిదురకనులతోనే... అతడు చూచిన చూపు... మనసున నాటుకుని ...ఎన్నటికీ కుదరని గాయం చేసింది;

—ఇంకా మేలుకునేఉన్నాడు. దీపంవెలుగులో పడకకుర్చీలో కూర్చుని ఏదో చదువుకుంటూ... ఆమె ప్రక్కనుంచి అడుగులో అడుగువేసుకుంటూ, తల వైపునఉన్న మేజామీద చేతఉన్నవి ఉంచి, ఓమారు ఓరగా అతడు చూడకుండా... చూసి, నిట్టూర్పును అరికట్టుకుంటూ... తిరిగి వచ్చేస్తున్నది... మళ్లా సమీపంలోకి వస్తూండగా... దాటిపోకముందు, చేయిజాపి ఆమెచేతిని పట్టుకున్నాడు.

భయంవేసింది, ఒళ్లుఝల్లుమని... పారవశ్యంగా మారిపోయి... అతనిచేతితోబాటు జరిగి వెళ్లి... కుర్చీ మోపుమీద కూర్చునిపోయింది...చాలా సంతోషంగా వెర్రి అయిపోయి, కంపించిపోతూ, అతనివంక చూడ లేక, తలవంచుకునే...అలా ఉన్నది...

లేచి కూర్చుని, వంచినతలను, చేతితో చుబుకమునకు అంగుళులు ఆన్చి ఎత్తి... కళ్లలోకి కళ్లు పెట్టి అవి చూపులా... ఘూర్ణిలుతూన్న ప్రేమవనధులు... అలా... అలా... దగ్గరకు జరిగి... మీదకు వాలిపోయి... ఆమె అప్రయత్నంగా అందించిన పెదవి మీద... పలుమొనచురుకు...

—వదలివేశాడు... పట్టు సడలినదే వ్యవధానముగా అక్కడ నిలువకుండా... బయటకు ఎలా వచ్చిపడ్డదో? విరహమున కాగిపోయిన... ఆమె కౌమారము అంతకన్న యిక ఎక్కువ తీయదనమును... భరించ లేదు...! ఆరాత్రి...

...తనగదిలోకి వెళ్లిపోయి...ఒంటరిగా రాత్రి వేగిరించడానికి— నిత్యమూ ఆమె పడే ఉసురుపాటు, ఆవేళ... తన్మయత్వంలో కలిసిపోయింది... ఎక్కడ లేని సత్తువా, సంతోషమూ... అడుగు ముందుకు పడనీయకుండా వెళ్లి అతనికౌగిలిలో వ్రాలమని... రెక్కలుపుతూన్నవి... కాని, వెనుదిరిగి అచాయలకు పోవడానికి, ఆమెకు ధైర్యం చాలలేదు... గదికుమ్మం దగ్గిర, ద్వారబంధముమీదుగా నిటారుగా చేయిచాపి ఆనుకుని నిలిచి... మధురభావనల పురశ్చరణలో... స్థాయి చిక్కించుకుంటూ మొగమంతా వెన్నెలల మయమైపోగా... ఎదుటఉన్న భవానీమూర్తికి...ఇంత కాలమునకు వరదానమిచ్చిన కృతజ్ఞతను... అంజలితో నివేదించుకున్నది...

—అంతకాలము... ఎందుకు విముఖుడుగా ఉన్నాడు... ఆవేళ అనుగ్రహించడానికి... కారణం ఏమిటి?... మరునాడు ...మరల అశుభవేళను...తెలిసి పోతుంది... లాలించి... అతనిచేత, పలికించలేక పోతుందా... ఇక ఎన్నటికైనా... విడువనిస్తుందా... కాని...

ఉదయం, అతడు కనపడీకూడా పలుకరించ లేదు; అదివరకు, ఆమెకు అది క్రొత్తగా తోచేదికాదు ...కాని, గడచినరాత్రి, జరిగినది ...అస్ఫురణ, అతని చూపులలో చూచాయగానైనా గోచరించలేకపోవడం ...మనస్సు చివుక్కుమన్నది...

ఊరిచివరనున్న తోటకు, స్వారి బయలుదేరే అలవాటున, ఆనాడూ, కాఫీతీసుకుని, వెళ్లిపోతూండగా... ఆమె చూసినచూపు ...అంతే... అదే ఆఖరు...

వెళ్లినపదిహేను నిమిషములకల్లా అప్పటికప్పుడే స్పృహతప్పిపోయిన ... నిస్పందమూర్తిని ...లోపలకు ...పడిపోవడం చూసి, సాయమునకు వచ్చినవారు ...తీసుకునివచ్చి ...పరుండబెట్టినారు; గుర్రము బెదరి లారీక్రిందకు విసిరివేసింది ...గాయములు కనుపించడం లేదుగాని, స్పృహలేని స్థితిలోనుకూడా, ఉండి, ఉండి, మెలికలారిపోతూన్నాడు ...తలితండ్రులు మొదలంట కూలిపోయినారు...

—వైద్యసహాయము ...అవసరము లేకుండానే ...మూసినకనులు శాశ్వతముగా ముద్రించుకునిపోయినవి. ఇక ఆతరువాత...

వేయిపీడకలలు ప్రత్యక్షంగా అనుభవించిన యాతన ...కన్నీరుకు, రోదనమునకు అందని ...దుఃఖము...

భోజనము చేయలేదు... ఎవరో, అలా పడి ఉండగా, ఒకమారు వచ్చి పలుకరించి, ఆమాట అన్నారు కాని... వినిపించుకోలేదు, వాళ్లూ మళ్లా రెట్టించలేదు...

ఆమె ప్రణయజీవనము ... విద్యుచ్ఛిదమైపోవడం ...బ్రతికిఉంటే ...ఎంతసుఖపడేదో ...ఎన్ని విధముల భోగములు అనుభవించేదో ...అవి అన్నీ తలచుకుని, ఏడ్చిఏడ్చి బరువు తగ్గించుకునేందుకన్నా ఆమెకు ఓపికలేదు...

ఆతడు ...పోయినాడా ...ఇంకా కన్నులలో మెలగుతూనేఉన్నాడు... ఇక ఆజన్మకు కనపడడనే? ...మనసిచ్చిన మచ్చికలో, అంతకాలము అలా అలయించడానికి కారణము, ఆతనినోటివెంట తెలుసుకునేందుకు, ఇక అవకాశములేదనే...

ఆతడు...లేకపోవడమేమిటి... అడుగో ఎదుట ...నవ్వుతూ... ఎంత ప్రసన్నంగా ...ప్రేమ ఉట్టిపడేచూపులతో... సమీపించుతూన్నాడో...! చీకటు లెక్కడ, గది అంతా వెన్నెలలమయమై కలకలలాడిపోతూండగా...

సమీపించి... మరీదగ్గరకు వచ్చి... కౌగిలిలోకి తీసుకుని... రాత్రిఅంతా... ఆమెను ఎడబాయకుండా ఉండి... తెల్లవారి మేలుకొనేసరికి... కనపడకపోయినామాత్రం ఏమి? ... ఇదివరకుమాత్రం పవలు... మాటాడుతూండేవాడా?...

తెల్లవారినతరువాత... ఇంటిలోవా రందరూ మెలకువరావడం తడవుగా రోదనం ప్రారంభించారు... ఆమె, కనుకొలుకులలోనైనా... నీటిబొట్టు కనుపించలేదు; మళ్లా ఎప్పుడు ...రాత్రి అవుతుంది... ఎంత త్వరగా, కనుపించుతాడు...

ఒకరోజు... రెండురోజులు ...దశాహము కూడా అయిపోయింది. కడసారిగా, నిత్యమూ ఆమెకు అలంకారములుచేసి సుమంగలీభూమికను అభినయింపచేసేవారు... రాత్రులు ...దానికి వినియోగమును... ఇంటివారు, కలలోనైనా తలచిఉండరు.

మూడవనాడు... ఆపిడుగువంటివార్తను తెలుసుకుని ఆమెతలితండ్రులు ఉరకలు పరుగులుగా వచ్చి చేరుకున్నారు... కూతురిని కౌగిలించుకుని, వాళ్లూ, వాళ్లను చూసి... ఇంటిలోకూడిన బంధువులూ, ఘొల్లుమన్నారు... ఆ అమ్మాయికి... నవ్వు వచ్చింది. ...ఎందుకు వాళ్లందరూ అలా ఏడవడం... తాను సుఖపడిపోతూన్నదనా?...

కాని, చెపితే నమ్మతారా?... వాళ్లకు అర్థం అవుతుందా? పుట్టింటివారు, తీసుకువెళ్లారు ...అలా అయిపోయిందికదాఅని కూతురిని చూసుకుంటూ, మనసులో క్రుంగిపోతూ ...ఎదురుగుండా బావురుమంటే పిల్లదానికి గుండె చెదిరిపోతుందేమోనని ...పుట్టెడు దుఃఖమూ దిగమ్రింగి ...ఆఒక్కపిల్లనూ చూసుకుంటూ కాలక్షేపము చేద్దామనుకుని ...సమాధానపరచుకున్నారు మనసును. ఆమె, అంతగా విచారించకపోవడం చూసి ...కొంతచోద్యంగా ఉన్నమాట నిజము, కాని, పసిదిగదా ...లోకానుభవము చాలకపోవడంమూలాన ...వచ్చినకష్టముపరిమితి తెలుసుకోలేకపోతూన్నదనుకున్నారు. క్రమముగా, మరచిపోయి ...నాలుగు కాలాలపాటు బ్రదికి వాళ్లకళ్లఎదుట బాగుండడమే, కావలసింది:

కాని... అక్కడ ఎంతోకాలం ఉండలేకపోయింది ...బ్రతికిఉన్నరోజులలో, అత్తవారిమీద విరోధాన ...వాళ్లగుమ్మం ఎన్నడూ తొక్కి చూడలేదు: ఇప్పుడూ ఆపగ మరచిపోలేదన్నమాట. ప్రతి రాత్రి, ఆతనికోసం ప్రతీక్షించేది. కనపడేవాడు కాడు; ఆతన్ని చూడకుండాఉండటం దుర్లభం ...అక్కడే ఉండిపోతే, తనమీదకూడా కోపంవచ్చి ...ఎన్నటికీ కనబడకూడదని పంతముపడితే ...ఏలా బతిమాలుకోవడం?– వెళ్లిపోవడమే మంచిది.

తలిదండ్రులను బతిమాలుకుని తిరిగీ అత్తవారియింటికి వెళ్లిపోయివచ్చేసింది; బెంగపోయేందుకు అడిగినదే తడవుగా ...ఏపని చెప్పినా వారు చేస్తూండటంచేత, వెళ్లిపోవాలని ఉన్నదని చెప్పగానే ...తండ్రి వెంట బెట్టుకుని తీసుకువెళ్లి దిగవిడిచాడు; విప్రలంభం తీరిపోయినతరువాత నాథునిసాన్నిధ్యం లభించబోయే వధూత్కంఠ ఆమెకవళికలలో కానుపించడం, ఆయనకు ఒకక్రొత్తవింతగా తోచింది, కాని, ఏమీ అనలేదు.

వియ్యంకు లిద్దరూ, ఒకరిని చూసి ఒకరు, కోడలిని చూసి అత్తగారూ ...మళ్లా శోకంలో పడిపోయినారు. ఆమెకుమాత్రం, అంతా నవ్వుగా... ఖులాసాగా ఉన్నది; ఎప్పుడు ప్రొద్దు గ్రుంకుతుందా ...ఎప్పుడు ఒంటరిగా ఆతనితో ఉండిపోవడానికి వీలవుతుందా...

రాడా?... ఇంకా కోపం ఎందుకూ, ఎదురుగుండా ఉండి, ఆజ్ఞాపించకపోయినా, మనసులో పొడసూపే ఆలోచనలకు అన్నిటికి ఆతనిప్రాపకం ఉన్నదని, ఆమెకు తెలుసును... ఎలా నడుచుకోమని బుద్ధి పుట్టిస్తే అలా మెలగుతూన్నది.

వచ్చాడు... ఆతనిఛాయామూర్తిలో అనురాగఝురులు, మరీ, తరంగితము ఔతూన్నవి: ఆతనికిన్నీ ఈవిరహము దుస్సహమైపోయిన దన్నమాట:

క్రమముగా... ఆమెధోరణిలోకూడా మార్పు కనిపించింది: విషాదరేఖలు ఏనాడో మాయమైపోయినవి: చూసేవారికి... ఆమెదుర్దశ అవగతము కాకపోవడమే కాకుండా మిాదుమిక్కిలి, అనుకూలుడైన అనురూపునితో హాయిగా కాపురం చేస్తూన్న ఇల్లాలి... తృప్తి ముఖమున నిత్యమూ తాండవించుతూండేది.

సాయంకాలము కాగానే... చక్కగా వేషము దిద్దుకుని... సరదాగా అటూ ఇటూ తిరుగుతూ... ఇంకా ప్రొద్దు మళ్లకముందే గదిలోకి పోయి తలుపువేసుకునేది... తెల్లవారేదాకా మళ్లా కనబడేదికాదు. ఒంటరిగా పడుకోలేదుకదా అని అత్తగారు ఆమెకు సాయం ఉంటానంటే అక్కరలేదని చెప్పేసింది...

ఎంతకాలం ఈవైఖరి చూస్తూ ఊరుకుంటారు? మొదట్లో... ఏమీ అనుకోలేదు... ఆమీద, కాలం గడచినకొద్దీ... అనుమానం తోచినా మళ్లా వెంటనే ఉపసంహరించుకునేవారు... ఇక నిశ్చయమని తోచింది. ...ఏమీ లేకపోతే ఆమెవర్తన నిష్కలంకమయితే... ఎందుకు అలా ...ఎవరైనా చేస్తున్నారా?...ఆవేషమేమిటి, ఆసరదా లేమిటి, ఏకోశానా౦రవంతవిచారమైనా ఉన్నట్టు కనుపించనిదే?... పోనీ, మనిషితత్వము అది అని ఊరుకున్నా... హద్దుమిారి పోతూంటే...చూస్తూ ఎలా సహించి ఉండటం? లోకులు ఏమనుకుంటారనే సంగతి ఎలా ఉన్నా... వంశగౌరవం మంట గలిపి ...ఎంత అప్రతిష్ఠ ...హామ్మో; వాడు పోయి ఇంకా మూడునెలలైనా దాటలేదే...!

—ఏమైనా సరే... ఈవిషయమునకు అంతు ఏదో కనుక్కొని ...ఆకులనాపకురాలిని ఇంట్లోనుంచి తక్షణం తరిమివేయవలెనని ...మామగారు తీర్మానించుకున్నాడు ...ఆవేళనే తేలిపోవాలి.

అర్ధరాత్రి కావచ్చింది; ఇల్లంతా ఎక్కడికక్కడ మాటుమణిగింది. ఆయన, ఆఅమ్మాయిపడుకునే గది గుమ్మందగ్గర చెవులు ఓరచేసుకుని నిలుచున్నాడు... లోపలనుంచి ...మాటలు చాలా తగ్గుగొంతులో వినబడుతూన్నవి ... పరకాయించి... చెవులు మరీ ఒగ్గి విన్నాడు... బతిమాలుకుంటూన్నది... అప్పుడే వెళ్లిపోవద్దని... ఇంకా కొంచెంసేపైనా ఉండమని...

హాఁ...హాఁ...పాపిష్ఠిది ...ఇదా జరుగుతూన్న నాటకం ...ఇల్లు మాలకొంప అయిపోయిందే... ఇందుకా, ఈవేషాలు అన్నీని ...ఇందుకోసమేనా అక్కడ నిలువకుండా వచ్చేసింది ...ఈఘనకార్యానికా... ?

తామసం ...ఆగిందికాదు ...తలుపుమీద ధడధడ మోదాడు ...తలుపు తీయకుండాఉన్నదా ఉతికలు-ఎత్తేసిఅయినా, లోపల జొరపడి వాళ్ల ఇద్దరినీ ఖూనీచేసేయవలసిందే!... తెగించి ...ఎన్నిగుండెలతో, ఎంతనిర్భయంగా వచ్చాడూ ...వాడెవరో ...తప్పించుకుని ...ఎక్కడికి పోతాడు? ఆగదికి రెండోగుమ్మం లేదు ...అయినా దయ్యాలలాగా ఇంటినిండా ఇంతెడుమంది ఉండగా అందరినీ కనుబ్రామి

ఎలా వచ్చాడు... ?కానీ...ఇవాళతో వాడిఆయుస్సు, సరి...

తీయకపోవడం చూసి, కాలితో తలుపును తన్నాడు... తెరుచుకున్నది... ఆమె ఘడియ తీసింది. చూపులతోనే కబళించి వేసేఅంతతీవ్రముగా చూశాడు. ఆమె ఏమాత్రమూ చెదరక ...ఎందుకు ఆవేళప్పుడు ఆయన అంతధీమాగా తలుపు పిలిచాడో తెలియక కలవరపడడంతప్ప తప్పు చేసినదానిలాగా లేనేలేదు. అవును... ఎంతకైనా తగినదే!

"ఎవరు?"

—ఆగర్జనలోనిభావ మేమిటో బోధపడలేదని ఆమెచూపులే ప్రత్యుత్తర మిచ్చినవి.

'ఎవరు... లోపల?'

'నేనే.'

'ఇంకా ఎవరూ లేరా?'

ఏదో సమాధానం చెప్పబోయి నాలుక మడత వేసుకుని ఊరుకున్నది... దాన్ని ఆయన మరీఅపార్థము చేసుకున్నాడు...

'మాట్లాడవేం?'

—ఏంఉన్నది మాట్లాడటానికి... ఆయన ధూకుడుగా లోపలికి వెళ్లి, దీపం హెచ్చించి... నలుమూలలా వెదికాడు ...ఎక్కడా ఎవరూ లేరు... కాని, ఆయనకు అనుమానం పోలేదు... స్వయంగా విన్నాడు కాదూ?

'ఎక్కడ దాచావు... చెప్పు... చెప్పవేం...'

జుట్టు పట్టుకుని... దవడమీద సాచి కొట్టాడు ...మాటాడకపోవటంతో మరింత రేగి పట్టువిడిచి ఎడాపెడా, రెండుచెంపలూ, వాయించాడు... బాదేశాడు... ఆమె, తిరిగి బేలై పడిపోయింది... ఇక పలుకుతూన్నది... అప్రయత్నంగా, ఆమె ఇష్టం ఏమీ లేకుండానే...

'వెళ్లిపోయినారు...'

'ఆలుచ్చా ఎవడో... చెప్పు...'

'మీ అబ్బాయి...'

'ఆఁ...ఆఁ...'

'అవును...'

'ఎంత తెగించావే... నీతలపండుపగులా... పోయినవాడి... ఉసురు, నీకు తగులదు లే... వాడి పేరు అడ్డంపెట్టుకుని ఇంత అవాచ్యపుపని చేస్తూ... నీముఖ మీడ్చా...'

—చేసిన నిర్వాహకము చాలక, పడిఉన్న ఆమెను కసిదీరా తన్ని హూనంహూనం చేశాడు. చెప్పు... వా డెవరో అని, ఒకతన్ను తగులనిస్తూ ఉండటం; ఆతాపు తిని... ఆమె, నూతిఅడుగునఉన్న మనిషిగొంతుతో... 'మీ అబ్బాయి'... అని జవాబు చెప్పతూండగానే చివరిఅక్షరంతో... మరోతన్నుకు ఆయన సిద్ధపడటం...

నిరవధిగా, ఆబీభత్సం ఎంతవరకూ సాగిపోనే దోకాని ఇంతలో, అత్తగారు వచ్చి, అడ్డుపడి, ఆయనను రెక్కపట్టుకుని అవతలకు తీసుకువెళ్లింది... ఆమె ఎదుట ఆయన, నోటికి వచ్చినట్లు నానాదుర్భాషలూ ఆడి... చివరకు అలసిపోయి సణుగుకుంటూ, గాద్గది కంతో దుఃఖం వెలారుస్తూ, పోయి పడుకున్నాడు.

ఆ అమ్మాయి... పడినచోటనే... ఆలాగే ముద్దయిపోయింది. అత్తగారు వచ్చి, సాయంఇచ్చి లేవదీసి, మెల్లిగా నడిపించుకుంటూ, గదిలోకి తీసుకువెళ్లి మంచముమీద పడుకోబెట్టి... మంచినీళ్లు త్రావడానికి ఇచ్చి... చేయి తడిచేసుకుని, కళ్లూ, ముఖమూ తుడిచి చెంపలమీద జుట్టు, పక్కలకు తుడిచి...

'ఏంపనిచేశావే తల్లీ... అటు ఏడు, ఇటు ఏడు తరాలా మన ఇంటా వంటా... ఎన్నడూ లేనిది' —అంటూ కొంచెం సముదాయింపుగా, కొంచెం నిష్ఠురంగా ...మాటలతో లోతు లాగవలెనని అంచనా వేసింది... ఆ అమ్మాయి ...ఏమీ జవాబు చెప్పలేదు. ...ఎవరూ నమ్మనప్పుడు ... ఏమిచెప్పిమాత్రం ప్రయోజనం ...ఏం ఉంటుంది?

"అవునులే ...మాఖర్మంకనుకనే, నీకు ఇలాంటి దుర్బుద్ధి పుట్టింది ...నిన్ను అనవలసినపనేముంది...?" అని రుంజుకుంటూ, అక్కడనుంచి వెళ్లిపోయింది...

చేసినహితబోధ అంతా వ్యర్థమైపోయి ...వేసినపాచిక ఏదీ పారక, ఆఅమ్మాయినోటివెంబడి మాటరాకపోవడం మూలాన!

—ఒళ్లు తెలియకుండా, పడిఉన్నపాటు... ముదిరిపోయి ...జ్వరం ముంచుకు వచ్చేసింది: ఇక అందులో, పిచ్చికేకలూ, వెర్రికేకలూ...

డాక్టరును పిలుపించుతే ...బండారం ఎక్కడ బయటపడి ...తమనెత్తిమీదకు వస్తుందోఅని ...ఊరుకునిఉండటానికీ మనస్కరించక ...దంపతులు ఇద్దరూ కూడబలుకుకుని ...తప్పకుండా, అదేదో గాలిలక్షణమే అని, నిర్ణయంచేసి, ఆమెతలితండ్రులకు 'తక్షణం రావలసినది' అని, టెలిగ్రాం ఇచ్చారు. వారు వచ్చేలోపున, భూతవైద్యానికి ఎవరిని కుదర్చవలెనా అనేమీమాంసలో ఏదీ తేలక ...లంఘనములుమాత్రం కడుతూ ఉన్నారు:

మూడవనాటి ఉదయానికి, పిల్లతలితండ్రులు ఇద్దరూ వణుక్కుంటూ అక్కడికి ఉరికారు; అప్పటికి, ఆమె మరీనీరసించి, లోజెడిపోయి. కళ్లల్లో ప్రాణాలతోఉన్నది. వియ్యంకుడిని చూడగానే మామగారు, చెప్పవలసిన ...కొండెములు అన్నీ కక్కేద్దామనుకున్నాడు. కాని, ఆయనఆకుర్దా చూసి, నోరు రాకపోయింది ...తండ్రి వెళ్లి డాక్టరును పిలుచుకువచ్చాడు దెబ్బలు అప్పటికి పాతగిలి ఉంటవిగనుక ... ఫరవాలేదని అత్తమామలుకూడా అడ్డుచెప్పలేదు. వైద్యుడు వచ్చి,రోగిని పరీక్షచేసినమీద... మరోక్రొత్తసంగతి... ఆమె గర్భముతో ఉన్నది!

—అంతవరకూ గృహస్థమర్యాదను పాటించో, మరి ఏమనుకునో, మెదలకుండా ఊరుకునిఉన్న మామగారు, తెగబడి, చెప్పవలసినవి నాలుగూ చెప్పాడు. తక్షణం — ఒకనిమిషం ఆలశ్యంచెయ్యకుండా, వాళ్లపిల్లా వాళ్లూ పోయి గంగలో కలవమన్నాడు... ఆ అమ్మాయితండ్రి మొగమింతచేసుకుని ...మారుమాటాడకుండా ...భార్యనూ కూతురినీ తీసుకుని ...వాళ్లఊరు వెళ్లిపోయినాడు.

ఆ అమ్మాయికి ...ఇక, ఆయింట అడుగుపెట్టే అర్హత లేదు. ఎంత చెప్పినా, ఎవరూ నమ్మరు. తనవర్తనలో ఏమీ దోషములేదనీ ...నాథునిలాలనలో ఋజుక్రమమున పొడసూపి వర్ధిలుతూన్న అంతర్వత్నీత్వమే కాని...పరపురుషసహవాసకళంకము లేదనీ వాళ్లు నమ్మడానికి...ఆధారము ఏదీ...బతికిఉన్నన్నాళ్లూ, వారిది పృథక్ఛయ్యావ్రతమని, ఇరుకుటుంబములవారికినీ తెలుసును. చనిపోయిన తరువాత... ఎంతో ఆపేక్షగా ఆచరిస్తూన్నాడనే అసామాన్య విపరీతస్థితిని... ఎవరు విశ్వసించుతారు. చారిత్రమును శంకించుకున్నారని, ఆమెకు బాధలేదు... నిజమును... నిజమని తాను చెప్పినా నమ్మలేకపోతున్నారనే తప్ప!

ఏమున్నదీ...అంతా, మళ్లా మొదటికి వచ్చింది. ఆతడు అక్కడ కనుపించడు... చేరరాడు. తిరిగీ అత్తవారింటికి వెళుదామంటే, వారు రానీయరు... ఆతన్ని చూడనిదీ... ఉండలేదు...

ఈచింతతో, చిక్కి శల్యమైపోతూన్నకొద్దీ గర్భధారణలక్షణములు మరింత ప్రస్ఫుటిస్తూన్నవి. వేకటి నిజము కాదేమో... వ్యాధిలక్షణమేమోనని అనుకున్నారుకాని, ఏవిధమైన ఔషధసేవనమునకు ఆమె ఒప్పుకోలేదు; జబ్బు వేరే ఇంకొకటైయుండగా ...ఇతర ఉపచారములు,దానికికాక ఎన్నిచేసినా నిష్ప్రయోజనమని ఆమెకు తెలుసును.

చూడగా, చూడగా, ఆమె తల్లి దండ్రులకు కూడా... గ్రహబాధ ఉన్నదనే నమ్మకము కుదిరింది. సలహా అడిగిన మంత్రశాస్త్రవేత్తకూడా, తప్పకుండా, అదేననీ... గర్భిణిగా ఉండటముకూడా ఆలక్షణము తప్ప వేరు ఏదీ కాదనీ... తాను బాగుచేస్తాననీ, వారందరినీ ఒప్పించాడు... పైగా ఆమెతల్లికి పూనకంలాగా వచ్చి... అల్లుడిగొంతుతో... తాను, భార్యమీద మమకారంచేత వచ్చాననీ, పట్టుకుని వదలకుండా, తనదగ్గరకు తీసుకువెళ్లిపోతాననీ... ఘంటాపథంగా ఘోషించింది. సామాన్యసంసారులకు... ఇక అంతకన్నా నిదర్శనం, ఏమి కావాలి?...

ఆమెకు, ఈకలాపమంతా, ఇష్టమా, కాదా? ...అని ఆలోచించలేదు వారెవరూ, ఆమెను అడుగలేదు... ఎద్దును అడిగి గంతలు కడుతారా?...

—పట్టువేసి ...దానిమీద తల్లితండ్రులూ, ఇంకా బంధువులూ పట్టుకుని కూర్చోపెట్టి...మంత్రోచ్చారణలో ...భూతము కట్టుపడి ...వెళ్లిపోతానని చెపుతుందేమో, మీదికి వచ్చి అని ...హ్రాం, హ్రీం,

సాధనలు ...బహుమతీ ఆశతో ...మొగమంతా కళ్లు చేసుకుని, ఆనాటి క్రొనాడు కుంకుమబొట్టు పెద్దది చేస్తూ, ఆమహానుభావుడు తాంత్రిక ప్రక్రియలన్నీ వినియోగించి చూశాడు...

ఎంత గట్టుసరి దయ్యమైనా ...ఎంత పీటగట్టు కుని కూర్చునేరకమైనా ...మంత్రోదకమహిమ ఊరికే పోతుందా?...

చివరకు...ఆనాడు, జడలోకి దింపి...సీసాలో పెట్టి ...భూతమును భూస్థాపితముచేయడానికి తరుణము వచ్చిందని ...మాంత్రికుడు సెలవిచ్చాడు: జరుగవలసినతంతు ఇనుమడిగా ఉన్నదికనుక, మరీ పెందలకడనే, కూర్చోవలసి ఉంటుంది.

పెళ్లికన్న ఎక్కువ హడావుడిగా... అన్నీ అమర్చుకుంటూ... ఆమెతల్లి, రోజంతా తీరికలేకుండా ఉన్నది... పలుకరించడానికైనా, ఆమె ఉన్న చాయలకు రాలేదు... అదీ కొంత మేలే!...

ఏకాగ్రదృష్టితో... ఏదో ఆలోచించుతూ, ఆమె పడుకుని ఉన్నది; మొదటికీ, ఇప్పటికీ ఆనవాలేలేదు; రూపే మారిపోయింది: క్రమంగా...ముఖంలో కరడుకట్టుకునిపోయిన విషాదము విరిసిపోతూ, ఆతావుల... ఆనందజ్యోత్స్నగుబాళించడము ... సముద్రమధ్యమున పడి... ఆధారములేక అల్లాడిపోయే ఆప్తురాలికి... ధరి చిక్కింది... బహుచలాకీతో, ఎక్కడలేని సత్తువతో... లేచి... వచ్చి, తలుపు గడియవేసుకున్నది... కొంచెంసేపటికి తీసి... ఇవతలకు ... వెళ్లిపోయింది:

వేళ అయేసరికి, ఆమె అజ వచ్చి... తల్లి, గది దగ్గరకు వచ్చి, లోపలకు తొంగిచూసింది... లేదు; ఇంట్లో ఏమూలనన్నా ఉన్నదేమోనని వెదికింది... కనబడలేదు; పెనిమిటితో చెప్పింది... గాభరాపడుతూ, ఆయనా, ఆవిడా కలిసి మళ్లా ఇంకోసారు కలయవేసి వెదికారు; ఊహుం... ఏమైంది... ఏమీ పాలుపోలేదు... ఆయనకు ఏమి తోచిందో కాని, గదిలోకి వెళ్లి... బల్లమీద రేకెత్తుకుని ఉన్న కాగితం మడతను ఒక్కఅంగలో అందుకుని... పైన...'నాన్నగారికి...' అని ఉండటం చూసి... మరీ ఆదుర్దాతో ఒక్కలాగుతో విడదీసి... చదువుతూ...

—చదువుతూండగా... ఆయనముఖంలో కళలు దిగజారిపోతూన్నవి; చదివినతరువాత... ఆయన కవళికను చిత్రించడానికి... శబ్దశక్తికి పాటవము చాలదు...

"నాన్నగారికి...

"నామేలు కోరి, నేను సుఖంగా ఉండవలెననే... మీచేతకు... విఘాతం కల్పించిన కృతఘ్నురాలినని... నిందించకండి...

"బ్రతికిఉన్నన్నాళ్ళూ, ఆయన నావంక కన్నెత్తి చూడలేదని మీకు తెలుసును: దానికిధర్మమునకు, మనం కర్తలమా, మంచికోసమే చేశాముకాని, సుఖపడే యోగం, దానినోష్టను లేనప్పుడు మనం ఏం చేయగలమని వేదాంతంచెప్పుకుని, ఏమైపోయినా చూస్తూ ఊరుకున్నారు; మా అత్తమామలుకూడా, కొడుకును మందలించి, మాకాపురం ఓదారికి తీసుకువద్దామని అనుకున్న పాపాన పోలేదు. అందుకు నేను ఏమీ అనడంలేదు...మీతో ఎన్నడైనా చెప్పానా, ఆయన తిన్నగా ఉండరని... నాబాధ నేను పడేదాన్నిగాని...

"అంతవరకూ, ఈ సంగతులు, ఇక్కడ మీకూ, అక్కడ వారికీ తెలుసును; ఇక చెప్పబోయేవి... నేను, జీవించియుండగా మీరు అర్థంచేసుకోలేకపోయినవి...నేను బ్రతుకడానికి ముఖ్యమైనవి...

" నేను... ఆయనను ఎన్నడూ అడుగలేదు... నాయెడ ఇంత విముఖంగా ఉండటానికి హేతువు ఏమని...ఆయనకూడా, నన్ను ఆదరించకపోవడమే తప్ప...పల్లెత్తి పరుషవాక్కు ఎన్నడూ రానీయలేదు;

"ఇక మర్నాడు ప్రొద్దున వేయేళ్ళూ నిండుతవి అనగా... ఆవాళరాత్రి... నన్ను దగ్గరకు తీసుకున్నారు... ఎందుకు అంత దయవచ్చిందో... ఆనాటినుంచీ మా సంసారము కుదురుకునేదే...

"ఎంతో ఆశపడ్డాను... ఎన్నో కోరుకున్నాను ...నామీద అంతదాకా కోపానికి కారణం ఏమిటో మర్నాడు ఆయననోటనే పలికించుదామనుకున్నాను ... కాని, ఎక్కడిది! నామాంగల్యం పెరిగిపోయింది ... తక్కువనోములు నోచి, ఎక్కువఫలాలకు ఆశపడితే ఎక్కడనుంచి వస్తాయి...

"ఆయనకు భూమిమీద అన్నోదకములు కరవై... ఈ పాడుప్రపంచము వదిలిపెట్టారు, కాని ఎందుచేతనో, మొదటినుంచీకూడా, నన్ను విడువరనే మనసుకు తోస్తూనేఉంది...మీకందరికీ పోయినాడు, నాకుమాత్రం... ఆయన ఉన్నట్టే...

"ఆ రాత్రి...ఆయన...కంపించి...కనుపించడమేమిటి... ప్రత్యక్షంగా... ఈజన్మకు దక్కదనుకున్న సుఖం అనుభవించితేను! అది మొదలు... ప్రతి రాత్రీ... ఎంతో దయతో... అనురాగంతో, నన్ను ఏలుకుంటూవచ్చారు...

"మీ ఇంటికి వచ్చాను... బ్రతికి ఉండగా ఎన్నడూ రానివారైనా... ఇక ఆపట్టింపు ఉండదేమో ననుకున్నాను, కాని... మీరు ఆయన మనసు ఎంత నొప్పించారో, చచ్చీ బ్రతికీకూడా, ఒక్కటే మోస్తరు; ఈ వైపు తిరిగిచూడలేదు...

"ఆయనను చూడనినీ ఉండలేక, మళ్ళా వాళ్ళ ఇంటికే వెళ్ళాను... అక్కడ ఇద్దరమూ సుఖంగా ఉన్నాము.

"మా మామగారు... నా విషయంలో చాలా శ్రద్ధగా తలచారు; ఆయనను అని ఏంలాభమున్నదిలే... కన్నవారు మీరే అర్థం చేసుకోలేకపోయినప్పుడు? పరాయివాడితో... నేను... ఛీ...

"ఇంటిలోనుంచి వెళ్ళిపొమ్మన్నాడుకాని ... మా దంపతులకు ఎడబాటు చేస్తూన్నానన్న స్ఫురణే లేదుకదా !... ఇక మీరు...

"బ్రతికినన్నాళ్ళూ ... ఆయనకు, మనసు కలుగకపోయింది... ఇప్పుడు, మేము ఏదోవిధంగా సుఖపడటం మీకు ఇష్టములేదు; ఘూలో, ధూళో, ఏమైతే నాకేం...ఏరూపాన అయినా, ఆయన నన్ను అంటిపట్టుకుని ఉండటంకన్న కావలసింది ఏమున్నది ... నన్ను ఇచ్చినది ఎందుకు? ఒకరి నొకరు ఎడబాయకుండా ఉంటామనేనా ?...

"లోకంలో మగనాళ్ళకు దైవం రక్షించితే నెల మసలడంలేదూ... నాకొక రైముఖాన్నే ప్రొద్దుపొడిచిందా... నాపెనిమిటితో నేను కాపురం చేస్తూన్నప్పుడు... ఆయన మీకు కనబడనంతమాత్రాన నా కడుపు ఫలించడం... పెద్దవిడ్డూర్యమా, తలవంపుల మారిపనా... కులానికి అప్రతిష్ఠా ?

"చనిపోయి ఏలా మారిపోతారో, మంత్రాల ప్రభావం ఏమిటో నాకు తెలియదు, కాని, ఒకవేళ నిజంగా వాటికి అంతశక్తి ఉండి, ఆయన ఎన్నటికీ నా సమీపానికి రావడానికి వీలులేకపోతే, ఇక ఈ బ్రతుకు ఎవరికోసమండీ !

"భ్రూణహత్య మహాపాప మని తెలుసును... కాని...దయ్యపుపిల్లే అవుతుందికాదూ, ఆపుట్టేశిశువు? మీ మామూలుమనుష్యులు... దాన్ని చేరనిస్తారా...? అది బయటపడి... ఎలా బ్రతుకుతుంది ?

"ఆయిన... నన్ను పట్టుకుని ఉన్నాడనే కాదూ మంత్రాలు చదివి... బాధించి చివరకు సీసాలో కుక్కి ఉక్కిరిబిక్కిరిచేసి నేలలో పూడ్చిపెడతారూ?...అవును, మీ కూతురిని ప్రేమతో చూస్తున్న మహాపరాధమునకు అంతశిక్ష మీరు చేయించవలసిందే! అంతటితోనైనా మీకు శాంతి కలుగుతుందా ?...

"నా పెనిమిటి ఎక్కడ ఉన్నాడో నేనూ అక్కడకే వెళుతున్నాను; పతివ్రత అయినస్త్రీ, భర్తను ఎన్నడూ విడిచిఉండరాదనీ... ఆయనమాటకు ఎదురు చెప్పకూడదనీ, చిన్ననాడు నాకు నేర్పలేదూ మీరు...? ఆయన భూతమైపోయినప్పుడు, సహధర్మచారిణికూడా... అంతే అయిపోతుంది... బ్రతికి ఉన్నప్పుడు, గ్రహచారం చాలక... సిరిసంపదలు హరించిపోతే...నేనూ బీదదాన్నే అయిపోయేదాన్ని కాదూ, అందుకు మీరు ఏమన్నా అనేవారా ?...

"మీ ఇంటివైపుకు ఎన్నడూ రాము... మా మీద ఏమీ అనవసరమైన మంత్రాలు ప్రయోగాలు చేయించి... అక్కడనైనా సుఖంగా ఉండకుండా చేయబోకండి ... మీపుణ్యమాయెను; ఇంకా ఎక్కడి ఆపేక్షలు... మీ మతంలో బ్రతికి ఉన్నవారే మనుష్యులుకాని... మనస్సుల్లో ఎంతెంత కావేషాలు దాచుకున్నా ఎన్నివంచనలు చేసినా...మీకు నచ్చుతుంది... చచ్చిపోగానే దయ్యములై ఎక్కడ పట్టి పీడించుకు తింటారో అని... తగనిభయమాయెను...

"ఇక ఉంటాను... ఎన్నడన్నా మమ్మల్ని దయతో తలచుకోండి... ఎక్కడ ఉన్నా, మీ వాళ్ళమే... మీ అమ్మాయి."